# 18. మనసు ఎలాంటిది?

పూర్వం కాశీకి కాలినడకన వెళుతున్న ఓ గృహస్థుకి ఓ సాధువు తారసపడ్డాడు.

"స్వామీ! నాదో సందేహం. తీర్చగలరా?"

ఏమిటన్నట్లుగా చూసాడు సాధువు.

"ఏ కోరికా లేకపోవడమే ఆధ్యాత్మిక ప్రగతికి చిహ్నం కదా? గత ముప్పై ఏళ్ళుగా ఎంతో నిష్ఠగా దేవతార్చన చేస్తున్నా నాకు రకరకాల కోరికలు కలుగుతున్నాయి. ఒకటి తీరితే ఇంకోటి సిద్ధమౌతోంది. వాటిని ఆపడం ఎలా?"

"సమాధానం రాత్రికి చెప్తాను." చెప్పాడాయన.

ఆ రాత్రి వంట ప్రయత్నానికి సిద్ధమయ్యాడు గృహస్థు. నిప్పు బాగా రాజుకోవడానికి, నరికి తెచ్చిన ఎండు కట్టెలని పొయ్యిలో వేయసాగాడు.

సాధువు అతని దగ్గరకొచ్చి చెప్పాడు.

"ఇప్పటికి చాలా వేసావు. ఇంక చాలు."

"వెయ్యకపోతే ఎలా స్వామీ? నిప్పు చల్లారి పోతుంది కదా?" అడిగాడు గృహస్థు.

"నీ ప్రశ్నకి జవాబు విను. అగ్నిలో కట్టెలు వేసే కొద్దీ కాలిపోతాయి. ఐనా, దాహం తీరక అగ్ని మళ్ళీ కావాలంటుంది. మన మనసు అగ్ని లాంటిది. అందులోని ఒక కోరిక తీరితే ఆ స్థానంలో కొత్త కోరికని సృష్టిస్తుంటుంది తప్ప ఇక చాలని ఎన్నడూ ఎవది మనసూ ఊరుకోదు. నిప్పులో ఇక కట్టెలని వేయకపోతే ఎలా నిప్పు చల్లారుతుందో, అలాగే మనసులో చేరిన కోరికలని తీర్చకపోతే తృష్ణ చల్లారుతుంది. అందుకే తృష్ణని 'మహాశనః' అంటారు. అంటే 'గొప్ప తిండిపోతు' అని అర్థం. 'కోరిక తీరింది' అని జాబితా చెప్పిన సందర్భమొక్కటీ చరిత్రలో లేనేలేదు. మనిషికి అతి సమీపంలో గుప్తంగా ఉండే అఖండ శత్రువైన ఈ తృష్ణని చల్లార్చే విధం ఇదొక్కటే."

ఆ గృహస్థుకి సాధువు బోధ వంట పట్టింది.

దారిలో సౌకర్యం కోసం వెంట తెచ్చుకున్న వస్తువులన్నిటినీ పంచేసి, వాటిని మోయడానికి తెచ్చుకున్న కూలీలని వెనక్కి పంపించేసాడు. కనీస అవసరాలతో, చిన్న చేతి సంచీతో కాశీకి ప్రయాణమయ్యాడు.

## 19. భక్తి-జ్ఞానం

మహారాష్ట్రలో జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్‌లనే ఇద్దరు మహాత్ములుండేవారు. పాండురంగని భక్తుడైన నామ్‌దేవ్‌కి విఠలుడు కన్పించి మాట్లాడుతుండేవాడు. ఓ రోజు జ్ఞానేశ్వర్ తన శిష్యులతో మాట్లాడుతూండగా గోరా అనే కుండలమ్మేవాడు వచ్చాడు.

"నువ్వు 'కుండలు పచ్చిగా ఉన్నాయా లేక బాగా కాలాయా' అని తెలుసుకుంటావు కదా? అలాగే ఇక్కడున్నవారిలో ఏవి పచ్చి కుండలో ఏవి బాగా కాలాయో తెలుసుకుని చెప్పు చూద్దాం." చెప్పాడు జ్ఞానేశ్వర్.

వెంటనే జ్ఞాని అయిన గోరా కుండలని తట్టే కర్రని తీసుకుని వారి దగ్గరకి వెళ్ళి దాంతో వాళ్ళ తలల మీద కొట్టసాగాడు. అక్కడ నామదేవుడు కూడా ఉన్నాడు. అతను పాండురంగడి భక్తుడు. నిత్యం నామ్‌దేవుడుకి పాండురంగడి దర్శనం లభిస్తూండేది. అలాంటి తన దగ్గరకి గోరా రాగానే నామ్‌దేవుడు అతన్ని దూరంగా తోసి చెప్పాడు.

"నిత్యం పాండురంగడితో ఆడుకునేవాడ్ని. నన్ను పరీక్షించాల్సిన పనిలేదు."

జ్ఞానేశ్వర్ నామదేవుని వారించి గోరాని పరీక్షించమన్నాడు. గోరా అతని తలమీద కర్రతో తట్టాక చెప్పాడు.

"స్వామీ! నామదేవుడు ఇంకా పచ్చికుండే. మిగిలిన వాళ్ళంతా కాలిన కుండలు."